క్లుప్తంగా

వైద్యానికి ఆర్థిక సాయం

టెక్కలి రూరల్: నర్సింగపల్లికి చెందిన జామాన వాసు రోడ్డు ప్రమాదం తీవ్రంగా గాయపడ్డారు. ఈయకు స్పాండిలైటిస్ సర్జరీ చేయించాల్సి ఉంది. అయితే అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామపెద్దలు, యువకులు 52,500 రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి ఆదివారం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో పోలాకి షణ్ముఖరావు, రౌతు బాలరాజు, దారపు పాపారావు, ఎన్ని షణ్ముఖరావు, రట్టి మణి, పి.గుణాకర్, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థి ప్రతిభ



టెక్కలి: రేపల్లెలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో తైక్వాండో విభాగంలో టెక్కలికి చెందిన అట్టాడ మహిధర్‌నాయుడు కాంస్య పతకం సాధించాడు. 38 కేజీల విభాగంలో ప్రతిభ సాధించిన మహిధర్ నాయుడు అంతకు ముునుపు జిల్లాస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

నందిగాం: లఖిదాసుపురం గ్రామానికి చెందిన డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న యువతి ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె పెదనాన్న ఫిర్యాదు చేసినట్లు నందిగాం పోలీసులు ఆదివారం తెలిపారు. ఈమె తల్లిదండ్రులు విశాఖలో ఉంటుండగా.. గ్రామంలో పెదనాన్న వద్ద ఉంటూ టెక్కలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నట్టు చెప్పారు. ఎస్సై షేక్‌మహమ్మద్‌ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారి ఆరోగ్యానికి రూ. 25 వేల వితరణ

ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ గ్రామానికి చెందిన బండారు పావని ఏడాదిన్నర కుమార్తె దియాకు న్యుమోనియా వ్యాధి సోకింది. పలు ఆస్పత్రుల్లో చూపించిన తల్లింద్రులకు పాప వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పడంతో దాతల సాయం కోసం ఎదురు చూశారు. ప్రస్తుతం చిన్నారి శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో వెంటీలేటర్‌పై ఉంది. విషయం తెలుసుకున్న స్పెషల్ గాయ్స్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) రూ. 25 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో చిన్నారి తల్లిదండ్రులకు ఆదివారం అందజేసి అండగా నిలిచారు.

టెక్కలి పంచాయతీని సుందరంగా తీర్చిదిద్దాలి



సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మేజర్ పంచాయతీ ఈవో ఎ.వి.శ్రీనివాస్, సిబ్బందితో మాట్లాడారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. పంచాయతీ ఆదాయం పెంచే విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. కొత్త ఇళ్లకు పన్నులు వేయాలని, సెంట్రల్ లైటింగ్ వాణిజ్య ప్రకటనలపై వినోదపు పన్ను వేసి ఆదాయం పెంచాలన్నారు.

స్కేటింగ్ రింక్ ప్రారంభం

సోంపేట: పట్టణ పరిధిలోని హైస్కూల్ గ్రౌండ్ వద్ద గల ఇండోర్ స్టేడియానికి సమీపంలో స్కేటింగ్ రింక్‌ను ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యాంసుందర్ శివాజీ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, జిల్లా స్పీడ్ స్కేటింగ్ కార్యదర్శి చంద్రావతి రింక్ ఫౌండర్ టంకాల బాబు, కోచ్ గోపాల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడుగా జయంతిరావు



అవార్డు అందుకుంటున్న జయంతిరావు

నందిగాం: నందిగాంకు చెందిన డాక్టర్ మాదిన జయంతిరావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2025ను పొందారు. విజయవాడలో సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు రెండు వేల మంది పాల్గొన్నారు. వారిలో ఈ అవార్డును డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్, సీఈవో అనువాదిని ఏఐ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ చీఫ్ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ చేతుల మీదుగా జయంతిరావు అందుకున్నారు. ఈయన టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్‌సీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

అడుగడుగునా ప్రమాదమే..!

- శిథిలమైన ప్రధాన రోడ్లు
- కలగా మిగిలిన పూండి–నౌపడ డబుల్ రోడ్డు నిర్మాణం
- పెరుగుతున్న ప్రమాదాలు



శిథిలమైన మందస మండలం మేఘమాల రోడ్డు

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రోడ్లను పట్టించుకోకపోవడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పలాస నియోజకవర్గంలో ప్రధాన అర్‌అండ్‌బీ రహదారులు శిథిలమైయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే కాశీబుగ్గ–అక్కుపల్లి, బెండిగేటు–పూండి, పూండి–నౌపడ రహదారులపై ప్రయాణం నరక ప్రాయంగా మారింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పలాస వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూండి రహదారికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆ తరువాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనుల ప్రారంభంలో జాప్యం నెలకొంది. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం దీని పట్టించుకోలేదు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పూండికి చెందిన టీడీపీ నాయకులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసినా ఈ రహదారికి మోక్షం లభించలేదు. దీంతో ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదికాక కాశీబుగ్గ–అక్కుపల్లి రహదారి సైతం అసంపూర్తిగా వదిలేశారు. అంబుసోలి నుంచి తాళభద్ర గేటు వరకు వాహన చోదకులకు నరక ప్రాయమైంది. ఈ రహదారుల్లో గత రెండు నెలల్లో ఏడు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. తాజాగా ఈ నెల 11వ తేదీన పూండి రహదారిపై గూనాలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలైయ్యారు. అలాగే మంచినీళ్లపేట–పీఎంపురం, కొటారి–తాళభద్ర, మందస నుంచి చీపి, అంబటి కంబారం రోడ్డు, బుడంబో, సాబకోట రహదారులు భయాందోళన కలిగిస్తున్నాయి. చీపి రోడ్డుపైన బాటసారులు సైతం నడవలేని పరిస్థితి ఉంది. రహదారులను నిర్మించి తీరుతామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు ఆ దిశగా కనీసం దృష్టిసారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



ప్రమాదకరంగా ఉన్న పూండి-లింగాలపాడు రోడ్డు



పూండి రహదారిపై జరిగిన ప్రమాదం(ఫైల్)

తక్షణమే పనులు చేపట్టాలి



పూండి రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు తక్షణమే పనులు చేపట్టాలి. కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, రామ్మోహన్‌నాయుడుని కలిసిన ఫొటోలను స్థానిక నేతలు పత్రికల్లో వేయించుకోవడం కాకుండా రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలి. బెండి గేటు నుంచి నౌపడ వరకు రహదారి అధ్వానంగా ఉంది. కనీసం మరమ్మతులైన చేపట్టాలి.

– జల్లు ఉషారాణి, లింగాలపాడు, వజ్రపుకొత్తూరు మండలం

రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వం విఫలం



అధికారంలోకి వస్తే ఏదో పొడిచేస్తామని బీరాలు పలికిన కూటమి నేతలు రహదారులను గాలికి వదిలేశారు. పూండి–మంచినీళ్లపేట, అక్కుపల్లి, పూండి, చీపి రహదారులపై ప్రయాణం భయం పుట్టిస్తోంది. ప్రసవ వేదన కలిగిస్తోంది. పలాస నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి పూర్తిగా చేపట్టం లేదు. నిధులు మంజూరులో ప్రభుత్వం విఫలమైంది.

– బి.ధర్మారావు, రెయ్యిపాడు

ప్రభుత్వ దుర్మార్గ ఆలోచనకు బుద్ధి చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్



కోటి సంతకాల సేకరణలో పేరాడ తిలక్ తదితరులు

సంతబొమ్మాళి: మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేసే కూటమి ప్రభుత్వ దుర్మార్గ ఆలోచనలకు ప్రజలే బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. జగన్నాధపురం, రుంకు హనుమంతుపురం పంచాయతీల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. పీపీపీ పేరుతో ప్రజలకు వైద్యం అందుబాటులోకి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు. టీడీపీ పెద్దలు వారి అనుచరులు, బినామీలకు మెడికల్ కాలేజీలను కట్టబెట్టే కుట్ర చేస్తుందని విమర్శించారు. నేడు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను పూర్తిగా నిలిపి వేశారని అన్నారు. విద్య, వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడంపై దష్టి పెట్టిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే నకిలీ మద్యం తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకొని ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత కరోనా సమయం రెండున్నర ఏళ్లు పోగా దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు జోగి రాములమ్మ, ఎన్ని మన్మథరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు సవర రాజు, నాయకులు నక్క భీమారావు, మార్పు నాగభూషణరావు, కె.సతీష్, సత్తారు సత్యం, రోణంకి మల్లయ్య, హేమసుందరరాజు, డొక్కరి నీలకంఠం, వినోద్, టంకాల బాబూరావు, మోహన్‌రావు ఉన్నారు.

నేడు కల్తీ మద్యంపై ధర్నా

టెక్కలి: రాష్ట్రంలో జరుగతున్న కల్తీ మద్యంపై సోమవారం టెక్కలిలో ధర్నా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బయటపడుతున్న కల్తీ మద్యం మాఫియా కేసును నీరుగార్చే విధంగా చంద్రబాబు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా టెక్కలిలో ట్రెండ్స్ షోరూమ్ వెనుక భాగంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదురుగా ఉదయం పది గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులంతా హాజరు కావాలని కోరారు.

పలాస: కల్తీ మద్యం, ఎన్.బ్రాండ్‌లకు వ్యతిరేకంగా కాశీబుగ్గ ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం పది గంటలకు నిరసన కార్యక్రమం చేపడుతున్నామని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం ప్రగతి భవనం నుంచి ఆదివారం ఓ ప్రకటన వెలువడింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా విభాగానికి చెందిన ప్రతినిధులు, వివిధ హోదాల్లో ముఖ్య కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ముందుగా కాశీబుగ్గ శ్రీనివాస్ లాడ్జి కూడలి వద్ద మానవహారం ఉంటుందని, ఆ తర్వాత ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఇచ్ఛాపురం: నకిలీ మద్యానికి వ్యతిరేకంగా సోమవారం నిరసన కార్యక్రమం చేపడుతున్న వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా విజయ ఆదివారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఇచ్ఛాపురంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం సంబంధిత అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనేతలు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మొక్కలతోనే మనుగడ



మొక్కలు నాటుతున్న కమిటీ సభ్యులు

మందస: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని గో్గ్రీన్ ప్రతినిధులు అన్నారు. మందస కేంద్రంలో సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మందస అభివృద్ధి కమిటీ (గో్గ్రీన్) ఆధ్వర్యంలో ప్రధాన రహదారి వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని కమిటీ సభ్యులు అన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గిన్ని తిరుపతి రెడ్డి, సీహెచ్ లక్ష్మణరావు, ఇప్పిలి చిట్టి, శ్రీనివాస పాడి, కోదండ, దున్నా హరికృష్ణ, కోరాడ ప్రసాద్, సంతోష్ పండా, కిల్లంశెట్టి నాగేశ్వరరావు, సింహచలపతి, రాధకృష్ణ పట్నాయక్, మల్లారెడ్డి రాజు పాల్గొన్నారు.

కరెంటు ఉన్నా చీకటే..!

- ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ గ్రామస్తుల్లో లోవోల్టేజ్ సమస్య
- ఎమ్మెల్యే సొంత గ్రామాల్లో దుస్థితి



కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు గెలిచిన బెందాళం అశోక్ సొంత గ్రామాలైన ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ ప్రజలను విద్యుత్ లోవోల్టేజ్ సమస్య వేధిస్తోంది. సుమారు ఐదు దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ లైన్లు కావడంతో నిత్యం సమస్య వెంటాడుతుంది. నాణ్యమైన విద్యుత్ వినియోగదారులకు అందని ద్రాక్షగా మారింది. దీంతో విద్యుత్ సరఫరా ఉన్నా చీకట్లో ఉన్నట్టే ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో అయితే ఈ సమస్య మరింత దుర్భరంగా ఉంటోంది. కవిటి మేజర్ పంచాయతీ పరిధిలో 16 హేబిటేషన్ గ్రామాలు ఉండగా ఒక్క లైన్‌మెన్‌తోనే క్షేత్రస్థాయిలో విద్యుత్ పనులన్నీ నడిపించేస్తున్నారు. రామయ్యపుట్టుగలో లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావును రామయ్యపుట్టుగ యువకులు సంప్రదించారు.దీంతో విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించి కొంతమొత్తాన్ని విద్యుత్ శాఖకు చెల్లించి లోవోల్టేజీ నివారణకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కోసం రెండేళ్ల కిందట డబ్బులు కట్టారు. ఆ మేరకు ఇప్పుడు అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ రెండేళ్లతర్వాత ఏర్పాటు అయింది. ఇక ప్రగడపుట్టుగ విషయానికి వస్తే విద్యుత్ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనేచందంగా మారింది. వాస్తవానికి ప్రగడపుట్టుగలో 306 గృహవాసాలు ఉండగా.. 315 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. టౌన్‌ఫీడర్ శ్లాబ్ ప్రకారం మిగిలిన ప్రాంతాల కంటే అధికంగా బిల్లులు వసూలు చేస్తారు. కానీ ఈ గ్రామానికి 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు రెండే ఉన్నాయి. వీటి ద్వారా కాలంచెల్లిన వైర్లతో విద్యుత్ సరఫరా నిద్రిస్తున్న నక్కమీద తాటిపండు పడ్డ చందంగా మారింది.ఇళ్లకు వస్తున్న విద్యుత్ 230 వోల్టులకు పైన ఉండాల్సింది. అదికాస్తా 160 నుంచి 180 వోల్టుల మధ్య పంపిణీ అవుతోంది. దీంతో వాషింగ్‌మేషన్లు, గ్రైండర్లు, ఫ్యాన్లు, ఎయిర్‌కూలర్లు తదితర విద్యుత్‌పరికరాలు పనితీరు మందగిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత ఇబ్బడిముబ్బడిగా బిల్లులు పెంచేసిన వైనం ప్రజలకు తెలిసినా కిమ్మనకుండా కట్టేస్తున్నారు. నెలవారీ ముక్కుపిండిమరీ బిల్లులు వసూలు చేస్తున్న కూటమి ప్రభుత్వంలో ఓ ఎమ్మెల్యే సొంత ఊరిలోనే లోవోల్టేజీ సమస్యను పరిష్కరించకుండా దశాబ్ద కాలానికి పైగా నిర్లక్ష్యంగా ఉన్న విద్యుత్‌శాఖ తీరు ముక్కున వేలేసేలా చేస్తోంది. గ్రామశివార్లలోని కన్నయ్యగారి వీధికి అసలు వోల్టేజీ 120 వోల్ట్‌లోనే ఉంటుంది. వేసవికాలంలో ఇక్కడ ఫ్యాన్లు కూడా తిరగవు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆన్‌లైన్ క్లాస్‌లకు ఇబ్బందులు



నేను ఇంట్లో ఉంటూనే ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటున్నాను. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. మాఇంటికి వోల్టేజీ సమస్య వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కరెంటు ఉంటున్న చీకట్లో ఉన్నట్టే ఉంటుంది. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– మాదిన పవన్,ప్రగడపుట్టుగ

ఫ్యాన్లు కాలిపోతున్నాయి



లోవోల్టేజీ మా ఊర్లో విద్యుత్ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తుంది. ఫ్యాన్లు, వాషింగ్ మెషీన్లు, టీవీలు వోల్టేజీ హెచ్చుతగ్గుల కారణంగా కాలిపోతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి పరిష్కారానికి చొరవ తీసుకోవాలి.

–అట్టాడ కిశోర్, ప్రగడపుట్టుగ, ఇంజినీరింగ్ విద్యార్థి

నిలువ నీడలేదు!

- హైవేపై కానరాని బస్ షెల్టర్లు
- ఎండ, వానలోనే బస్సుల కోసం వేచి ఉంటున్న ప్రయాణికులు



నందిగాంలో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్



బస్ కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

నందిగాం: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గం పరిధి నందిగాం మండలంలో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి పొడుగునా ఎక్కడా బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండ, వానలోనే బస్సులు, ఇతర వాహనాల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. 112 రెవెన్యూ గ్రామాలతో ఉన్న మండలానికి నందిగాం ప్రధాన కేంద్రంగా ఉన్నా కనీసం బస్ షెల్టర్‌కు నోచుకోలేదు. దశాబ్దాల క్రితం ఓ షెల్టర్ నిర్మాణం చేసినా అది వినియోగంలోకి రాలేదు. షెల్టర్ ఒక చోట ఉండగా ఫ్లైఓవర్ బ్రిడ్జి అండర్ ప్యాసేజ్ మరో చోట ఉండటంతో ప్రయాణికులకు ఉపయోగం లేకుండా పోయింది. ప్రజలు వివిధ అవసరాల కోసం మండల పరిధిలోని నర్సిపురం నుంచి పెద్దబాణాపురం వరకు విస్తరించి ఉన్న 21 కిలోమీటర్ల జాతీయ రహదారి వెంట ఉన్న వివిధ జంక్షన్ల నుంచి ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల కోసం మండల కేంద్రాలైన నందిగాం, టెక్కలి, పలాస, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు హైవేకు చేరుకొని బస్సుల కోసం వేచి ఉండాలి. ప్రధాన కూడళ్లలో సైతం షెల్టర్లు లేకపోవడంతో ఎండకు, వానకు ఆరుబయటే వేసి ఉండే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పాత్రునివలస, పెద్దినాయుడుపేట, వజ్జీలపేట, తురకులకోట, కొండతెంబూరు, దేవుపురం, లట్టిగాం, పెద్దలవునిపల్లి, నందిగాం, ఆకులరఘునాథపురం, మద్దిలివానిపేట, పెద్దతామరాపల్లి, గొల్లూరు జంక్షన్లలో షెల్టర్లు లేక ప్రయాణీలకు తిప్పలు తప్పడం లేదు. నందిగాం మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పే బాబాయ్–అబ్బాయ్‌లైన.. రాష్ట్ర, కేంద్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడులు తమ రాజకీయ జీవితంలో నందిగాం మండల పరిధిలో ఎన్ని బస్ షెల్టర్లు నిర్మాణం చేయించారో చెప్పాలని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి హైవే వెంబడి ప్రయాణికులకు అనువైన జంక్షన్ల వద్ద బస్ షెల్టర్ల నిర్మాణాలు చేపట్టాలనని కోరుతున్నారు.

అవస్థలు తప్పడం లేదు



బస్ ప్రయాణం చేయాలంటే నందిగాం పరిధిలో ఏ జంక్షన్‌లో కూడా నిలువ నీడ, వసతి సౌకర్యం లేదు. మహిళలు, చిన్న పిల్లలతో వచ్చివెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. ఎండ, వానలోనే బస్ కోసం ఎదురుచూడవలసి వస్తుంది. ఎయిర్‌పోర్టులు తర్వాత కట్టవచ్చు ముందు బస్ షెల్టర్లు కట్టి ప్రజల అవస్థలు తీర్చండి.

– చమళ్ల సుభాషిణి, ప్రయాణికురాలు, చమళ్లపుట్టుగ

నీడ కల్పించండి



ఏదైనా పని మీద నందిగాం వస్తే బస్సుల కోసం ఎండ, వానలోనే వేసి ఉండాలి. లేదంటే దుకాణాల వద్ద నిలుచోవలసి వస్తుంది. నాలాంటి ముసలివారు, ఆస్పత్రికి వచ్చే రోగులు చాలా ఇబ్బంది పడుతున్నాము. అధికారులు, నాయకులు దృష్టిపెట్టి నందిగాంలో షెల్టర్ ఏర్పాటు చేయాలి.

– బమ్మిడి దాలయ్య, ప్రయాణికుడు, కొండతెంబూరు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మండల కేంద్రమైన నందిగాంలో ఉన్న బస్ షెల్టర్ నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవం. దాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు ఉన్నతాధికారుల దృష్టిలో పెడతాం. మిగతా చోట్ల షెల్టర్ల ఏర్పాటు ఆర్టీసీ పరిధిలో ఉండదు. ఆయా పంచాయతీలు స్థలంతో పాటు నిర్మాణం చేసుకోవాలి.

– ఎస్.శ్రీనివాసరావు, ఆర్టీసీ డిపో మేనేజర్, టెక్కలి

కూటమి కుట్రలను అడ్డుకుంటాం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



కేశుపురంలో కోటి సంతకాలను సేకరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు



సోంపేట: బాతుపురంలో సంతకాలు సేకరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలతో కలసి అడ్డుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, పార్టీ గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటుపై కొఠారీ, కేశుపురం, డొంకూరు తీర ప్రాంత మత్స్యకార గ్రామంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా 17 మెడికల్ కళాశాలలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబుకు అమరావతిలో రాజధాని నిర్మాణంపై ఉన్న శ్రద్ధ మెడికల్ కాలేజీలపై లేదన్నారు. మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు ఉద్యమ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఆందోళనలు చేపడతామని అన్నారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, ఎంపీపీ బోర పుష్ప, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, సర్పంచ్‌లు దుక్క ధనలక్ష్మి, గుజ్జు ఢిల్లీరావు, నర్తు వరప్రసాద్ యాదవ్, బుద్ధ మోహనాంగి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, మండల కన్వీనర్ బాగ మోహనరావు పాల్గొన్నారు.

సోంపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనకు వ్యతిరేకంగా బాతుపురం, సుంకిడి గ్రామ పంచాయతీల పరిధిలో సంతకాల సేకరణను చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల విషయంలో వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, స్థానిక ఎంపీపీ నిమ్మన దాసు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బతకల మోహన్‌రావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్



కవిటి: సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తదితరులు

కవిటి: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను కూటమి సర్కార్ విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి విద్యార్థులు డాక్టర్ కావాలనే ఆశలను నెరవేర్చేందుకు వైద్య కాలేజీలను ఏర్పాటు చేయగా.. వాటిని పీపీపీ విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చూడడం తగదన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వరక పంచాయతీలో ఆదివారం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ విలేజ్ కమిటీల ఏర్పాటును పర్యవేక్షించారు. నాయకులు శ్రీకాంత్ పురియా, బడగల రాజేంద్రం, బెండి జగదీష్, నర్తు దూదయ్య, శివాజీ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

పలాస: ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన పథకంలో భాగంగా గత ప్రభుత్వం హయాంలో మంజూరై ఆగిపోయిన ఇళ్లను సత్వరమే పూర్తి చేయాలని సోషల్ డెవలప్‌మెంటు స్పెషలిస్టు మల్లేశ్వరరావు చెప్పారు. పలాస పెద్దవీధిలో ఆదివారం మహిళల తో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందని..అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్పీలు మహాలక్ష్మి,రమాదేవి పాల్గొన్నారు.